క్లుప్తంగా

వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెనగలూరు: ముక్కా రూపానందరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి శనివారం పెనగలూరు హైస్కూల్‌లో వైద్య సేవలు చేశారు. వైద్య శిబిరంలో 720 మందికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయగా మరో 245 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఆపరేషన్లు తిరుపతి వెంకటేశ్వర అరవింద్ ఆసుపత్రిలో రూపానంద రడ్డి ఉచితంగా నిర్వహించారు. రెండో కంటికి ఆపరేషన్ అవసరమైన వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరలో మరో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, అక్కడికి వస్తే ఆపరేషన్ చేయించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం వైద్య శిబిరంలో పాల్గొన్నవారికి భోజన సౌకర్యం కల్పించారు. సాయి మౌనిక, వేణుగోపాల్ రెడ్డి, దశరథరామిరెడ్డి, ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, అరవింద ఆసుపత్రి సిబ్బంది గౌరీ శంకర్, దినేష్, శివ, కావ్య, ఆశ, సర్పంచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న శ్రీ వేంకటేశ్వరస్వామి

సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పలు పూజాది క్రతువులను నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామికి..

చిన్నమండెం: మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లెలో వెలిసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ..

లక్కిరెడ్డిపల్లి: వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమలో భక్తులు, ఆలయ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ నిర్మాణ పనుల పరిశీలన



సచివాలయ పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని మైసూరువారిపల్లె పంచాయతీలోని మామిడికాయల యార్డు సమీపంలో నిర్మాణ దశలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను శనివారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని పంచాయతీరాజ్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. పనులను సాధ్యమైనంత త్వరగా నాణ్యతగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మల్లు క్రిష్టారెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, బత్తల సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సుదర్శన హోమం

వేంపల్లె : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం వేడుకగా జరిగింది. శనివారం ఆలయ అర్చకులు అచ్యుత్ నారాయణ ఆధ్వర్యంలో ఈ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హోమాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటికి సాగిన పీర్లు

భక్తిశ్రద్ధలతో మొహర్రం



చిట్వేలిలో పీర్ల గ్రామోత్సవం

రాయచోటిటౌన్: రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో శనివారం మొహర్రంను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీర్ల ఊరేగింపులో హిందూ,ముస్లింలు ఐక్యంగా సాగారు.

-మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని ప్రముఖ పారిశ్రామిక వేత్త సిరిగిరి శ్రీనివాసుల రెడ్డి అన్నారు. సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ సిరిగిరి కుళాయిరెడ్డి కుమారుడు సిరిగిరి శ్రీనివాసుల రెడ్డి, కోడలు దీప పీర్లలకు బాషికాలను గుర్రంపై ఊరేగింపుగా తీసుకొచ్చారు. అంతకు ముందుగా గ్రామంలో అన్నదానం చేశారు. వీఆర్‌డీఎస్ సంస్థ సభ్యుడు సురేంద్రారెడ్డి,ధర్మారెడ్డి పాల్గొన్నారు.

రామాపురం: మండలంలో మొహర్రం పండగను శుక్ర, శనివారాలలో మండలంలోని గువ్వలచెరువు, నీలకంఠ్రావుపేట, దూదేకులపల్లె, సుద్దమళ్ల, కుమ్మరపల్లె, దూదేకుల రాచపల్లె, గంగనేరు, హసనాపురం గ్రామాల్లో హిందూ ముస్లింలు ఘనంగా జరుకున్నారు. కుమ్మరపల్లె, గంగనేరు, హసనాపురం గ్రామాలలో పీర్లను చావిడిలలో ఏర్పాటు చేశారు.

చిట్వేలి: మండలంలోని చిట్వేలి, నేతివారిపల్లి, నగిరిపాడు, కస్తూరివారిపల్లిలో పీర్లను ఊరేగించారు. వేకువజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం మేళతాళాల మధ్య పీర్లను గ్రామోత్సవంగా ఏటికి సాగనంపారు. ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టిబందోబస్తు నిర్వహించారు.

గాలివీడు: పీర్ల పండుగ శనివారం సాయంత్రం జల్దితో ముగిసింది. మండలంలోని బోరెడ్డిగారిపల్లె, గుంటికాడపల్లెలో పీర్లు 10వ రోజు సాయంత్రం పీర్ల ఆలింగనంతో జాతరను సంతరిస్తుంది.

పెనగలూరు: మండలంలో పీర్లు ఏటికి సాగాయి. శనివారం తెల్లవారుజామున వందల సంఖ్యలో భక్తులు గుండం తొక్కారు. శుక్రవారం రాత్రి భక్తులు పీర్ల చావిడి వద్ద జాగారం చేశారు. మండలంలో పెనగలూరు, ఓబిలి, నల్లపరెడ్డిపల్లి, పొందలూరు, నాయుడువారిపల్లి గ్రామాలలో ఈ మొహరం వేడుకలు నిర్వహించారు.



రైల్వేకోడూరులో పీర్ల ఊరేగింపు

రైల్వేకోడూరు : నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోడూరు మండలంలోని రాఘవరాజుపురం, కె.బుడుగుంటపల్లె, రెడ్డివారిపల్లె గ్రామాలలో పీర్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్లను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం పీర్లను ఏటికి సాగనంపారు.

పుల్లంపేట: మండలంలోని కోనెయ్యగారిపల్లి, దళవాయిపల్లి, అప్పారాజుపేట తదితర గ్రామాలలో మొహరం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం కొన్ని గ్రామాలలోని పీర్లు ఏటికి పోగా, మరికొన్ని గ్రామాలలో ఆదివారం పీర్లు ఏటికి సాగనున్నట్లు నిర్వహకులు తెలిపారు. పీర్లకు పెద్దఎత్తున పూల బాసికాలు కట్టి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్ల స్వాములకు బొరుగులు, బెల్లం, పానకంలను నైవేద్యంగా పెట్టారు. శనివారం రాత్రి మండల పరిధిలోని దళవాయిపల్లిలో పెద్దఎత్తున అగ్నిగుండం కార్యక్రమం జరగనుంది. ఆదివారం పీర్లను ఏటికి సాగనంపనున్నారు.



రామాపురం.. గుర్రంపై బాసికాలు, గంధంతో మెరవణిగా వస్తున్న శ్రీనివాసులరెడ్డి తదితరులు

రాజంపేట రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లె, మందపల్లె, ఆర్. బుడుగుంటపల్లె, గుండ్లూరు, ఆకేపాడు తదితర గ్రామాల్లో హిందూ,ముస్లింలు కలిసికట్టుగా పండుగను జరుపుకున్నారు. పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.



కుమ్మరపల్లెలో పురవీధుల్లో పీర్ల ఊరేగింపు



పుల్లంపేట: కోనెయ్యగారిపల్లిలో పీర్ల ఊరేగింపు



ఆర్.బుడుగుంటపల్లెలో మకాన్‌లో కొలువుదీరిన పీర్లు

పెన్నేటిలో నీటి పరవళ్లు



సిద్దవటం సమీపంలో పెన్నమ్మ జలకళ

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని పెన్నానది శనివారం తెల్లవారు జాము నుంచి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. నదీ పరివాహ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో పెన్నానదిపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వేకి దగ్గరలో నీరు ప్రవహిస్తోంది. వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పెన్నా పరివాహక ప్రాంతాల రైతులకు చెందిన వ్యవసాయ బోర్లలో నీరు లేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత వరదలతో నదీ ఒడ్డున ఉన్న గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుచ్చి వాహనంపై కడపరాయుడు



మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి శనివారం తిరుచ్చి వాహనంపై గ్రామ ప్రజలకు దర్శనమిచ్చారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్, సాయి బృందం తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి రథంపై కొలువుదీర్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని గోవింద నామస్మరణల మధ్య దేవునికడప మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ ఇళ్ల వద్దకే తరలివచ్చిన దేవతామూర్తులను దర్శించుకుని పూజా సామగ్రిని అందజేసి మొక్కుకున్నారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వైమానిక దళంలో అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



ఎయిర్‌వింగ్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తున్న నాన్ కమిషనర్ అధికారి అరుణ్

బద్వేలు అర్బన్ : భారత వైమానిక దళంలో యువతకు అద్భుత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ నాన్ కమిషనర్ అధికారులు రాజేష్, అరుణ్ గోస్వామి, సునీల్ దాస్‌లు పేర్కొన్నారు. భారత వైమానిక దళంలో రిక్రూట్‌మెంట్‌పై శనివారం స్థానిక రాచపూడి ఫంక్షన్ హాలులో రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేయు విధానం, ఎంపిక ప్రక్రియ, ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చేశిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఈ నెల 27వతేదీనుంచి ఆగస్టు 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇంటర్ సైన్స్ విద్యార్థులు, డిప్లమో చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అనంతరం కళాశాల యాజ మాన్యం ఆధ్వర్యంలో ఎయిర్ వింగ్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఏవో, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ సూపరింటెండెంట్ ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చలపతి, ఆర్మీ ఏఎస్ఓ బాల ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

పత్రికుల యువజన కార్యవర్గం ఎన్నిక



అన్నమయ్య జిల్లా పత్రికుల యువజన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న కులపెద్దలు

మదనపల్లె : అన్నమయ్య జిల్లా పత్రికుల యువజన కార్యవర్గ ఎన్నిక శనివారం మదనపల్లెలో జరిగింది. అన్నమయ్య జిల్లా పత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంత్ సమక్షంలో యువజన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జల ఈశ్వర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా పెండే రిభార్గవనాయుడు, కోశాధికారిగా ఇట్నేని నరేష్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఇట్నేని రెడ్డెప్పనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జల్లా సతీష్‌నాయుడు, కార్యనిర్వాహక సభ్యులుగా నవీన్‌నాయుడు, జంగాల విజయ్‌కుమార్ నాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంత్ మాట్లాడుతూ ఓసీ జాబితాలో ఉన్న తమ కులాన్ని బీసీ-ఏ జాబితాలోకి చేర్చి న్యాయంచేసిన ఘనత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ రిజర్వేషన్ ద్వారానే తమ కులంలో ఎందరో సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలుగా ఎన్నికయ్యేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరనాయుడు, ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రామాంజి, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్‌కుమార్, రామనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే లాడ్జీల సీజ్

– డీఎస్పీ మహబూబ్ బాషా హెచ్చరిక

రాయచోటిటౌన్ : ఆధారాలు లేకుండా ఎవరైనా లాడ్జిలలో రూములిస్తే కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా హెచ్చరించారు. శనివారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పట్టణంలోని లాడ్జీ యజమానులు, నిర్వాహకులకు లాడ్జీ నిర్వహణపై సూచనలు– సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా లాడ్జికి వస్తే వారి ఆధార్ కార్డు జిరాక్స్ లేదా ఏదైనా ఫోటో ఉన్న గుర్తింపు కార్డు (డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు వంటివి) తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి రోజు ఎంత మంది వచ్చింది ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు రికార్డు నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో ఉంచాలని చెప్పారు. అలాగే ప్రతి లాడ్జిలోనూ ఎంట్రెన్స్‌లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొన్ని లాడ్జీలలో గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని తమ తనిఖీలలో అలాంటివి కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లాడ్జీ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా

పులుల సంరక్షణ బాధ్యత అందరిదీ

సిద్దవటం: ప్రతి ఒక్కరూ అడవులపై అవగాహన కలిగి ఉండడంతో పాటు పులులను సంరక్షించాలని రేంజర్ కళావతి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సిద్దవటం లోని ఎస్. రాజంపేట, వంతాటిపల్లె, ఎస్సీ కాలనీ, గొల్లపల్లె , చలమారెడ్డి కాలనీ, సిద్దవటం దిగువపేట గ్రామాలలో శనివారం జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు పులుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ పులుల పరిరక్షణ, జీవావరణంలో వాటి పాత్ర గురించి ప్రజలకు వివరించారు.పులుల ఆవాస ప్రాంతాలు ఉన్నట్లయితే అటవీ అభివృద్ధి చెందినట్లు అవుతుందన్నారు. అడవుల వల్లే పర్యావరణాన్ని పరిరక్షించ వచ్చున న్నారు. అడవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె అన్నారు. డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, సప్తగిరి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ఫారెస్టు బీట్ అధికారులు, అసిస్టెంటు బీట్ అధికారులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దవటం దిగువపేటలో అటవీ అధికారులు ర్యాలీ నిర్వహించిన దృశ్యం

అడవుల్లో జీవ వైవిధ్యానికి పులులే కీలకం..

వేంపల్లె : అడవుల్లో జీవ వైవిధ్యానికి పులులే కీలకమని వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ డిప్యూటీ అధికారి డి.గుర్రప్ప తెలిపారు. శనివారం అంతర్జాతీయ పెద్ద పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో వేంపల్లె అటవీశాఖ రేంజ్ అధికారి పి.బాలసుబ్రమణ్యం సూచనల మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి డి.గుర్రప్ప పెద్ద పులుల సంరక్షణ, వాటి ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పులులను సంరక్షించడంవల్ల అడవులను కాపాడుకోవచ్చునని.. ప్రతి ఒక్కరూ జంతువుల పరిరక్షణకు సహకరించాలన్నారు. పాంథేరా జాతికి చెందిన పెద్ద పులి (పాంథేరా టైగ్రిస్)ను మనదేశం జాతీయ జంతువుగా ఎంచుకుందన్నారు. పెద్ద పులులు ఉన్న ప్రాంతంలో అడవి అన్ని రకాలుగా జీవ వైవిధ్యంతో పచ్చగా ఉంటుందని.. పెద్ద పులులు తిరుగుతుండటంవల్ల అడవులలో వాతావరణ మార్పులను నివారించి సకాలంలో వర్షాలు కురిసేందుకు, మనకు కావాల్సిన ఆక్సిజన్ అందించేందుకు సహాయపడుతాయన్నారు. అందుకు పెద్ద పులుల సంరక్షణ కోసం అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపుతారన్నారు. పెద్ద పులులతోపాటు వన్య ప్రాణుల సంరక్షణ కూడా అడవుల పరిరక్షణలో భాగమేనన్నారు.

పులులను సంరక్షించుకోవాలి..

మైదుకూరు: పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మైదుకూరులో శనివారం వనిపెంట అటవీ అధికారులు పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్ఓ దివాకర్ మాట్లాడారు. వనిపెంట అటవీ రేంజి అధికారి ప్రణీతరావు, డీఆర్ఓ శ్యాంసుందర్, ఎఫ్ఎస్ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోర్ల వద్ద వైర్లు చోరీ

రామాపురం : మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ అడపలమాలపల్లికు చెందిన ఆరుగురి రైతుల వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధిత రైతులు శనివారం మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన వైర్లను శుక్రవారం రాత్రి దొంగలు దోచుకెళ్లారని బాధిత రైతులు కడపల రమేష్‌బాబు, అడపాల వెంకటరమణ, ఆడపల సుబ్బరాయుడు, సుంపిరి సూర్యనారాయణ, సింపిలి చెంద్రాయుడు, గంగనపలిల వెంకటరమణ తెలిపారు. వ్యవసాయం సాగు చేస్తున్న సమయంలో వైర్లు చోరీ కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

– ఐటీబీపీ కమాండెంట్ అమిత్ భాటియా



నల్లగంగమ్మ ఆలయ సమీపంలో మొక్కలు నాటుతున్న ఐటీబీపీ సిబ్బంది

సంబేపల్లె : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఐటీబీపీ కమాండెంట్ అమిత్‌భాటియా అన్నారు. శనివారం మండల పరిధిలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయ ప్రాంగణంతో పాటు పలు ప్రాంతాల్లో విరివిగా ఇండో టిబెటన్‌బోర్డర్ పోలీస్ 53వ బెటాలియన్ వారు ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమాండర్ మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల రేడియేషన్ తగ్గుతుందని.. వర్షాలు బాగా కురుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకుడు వీవీ ప్రతాప్‌రెడ్డి, ఐటీబీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు



ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డు

అట్లూరు : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీవాణి హెచ్చరించారు. అట్లూరు రెవెన్యూ పొలంలోని సర్వేనెంబరు 944–3లో ఒక ఎకరా 30 సెంట్లు ప్రభుత్వం స్థలం స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో ఉంది. ఈ స్థలాన్ని శుక్రవారం ఎవరో ఆక్రమించేందుకు చదును చేయడంతో ఆ స్థలంలో తహసీల్దార్ శనివారం సిబ్బందితో సూచిక బోర్డును ఏర్పాటు చేయించారు. ఎవరైన ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆమె తెలిపారు.

జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు : జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మార్కెట్ యార్డు నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పడితే 50వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలో ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని అన్నారు. ఈనెల 25న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌పై, రాష్ట్ర విభజన హామీలపై టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ పార్టీలు నోరు మెదపడం లేదన్నారు. ఈ మూడు పార్టీలు బీజేపీకి మద్దతు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు విజయకుమార్, బాలసుబ్బయ్య, ఓబులేసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాల్‌మోన్,చంటి, గుర్రమ్మ, ప్రమీలమ్మ, రాఘవ పాల్గొన్నారు.